క్లుప్తంగా

నేడు జోగి రమేష్ ఎన్నికల ప్రచారం

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఈనెల శనివారం రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ ఎన్నికల ప్రచారం సాగించనున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు ఉయ్యూరు పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సంక్షేమ పథకాలను వివరిస్తూ రోడ్ షో, ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు కంకిపాడు పట్టణంలో ఎన్నికల ప్రచారం, రోడ్‌షో సాగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు నుంచి తాడిగడప, 5 గంటలకు కానూరు సనత్ నగర్, కానూరు, మురళీనగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం, సంక్షేమ పథకాలను తెలియజేస్తూ రోడ్‌షో నిర్వహించనున్నారు. పర్యటనను పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

గంగానమ్మకు శతఘటాభిషేకం



నున్న(విజయవాడరూరల్): గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా మూడవ రోజు గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ చేసిన రోజు, అక్షయ తృతీయ పురస్కరించుకొని నున్న గ్రామంలోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం నుంచి 108 మంది భక్తులు మహిళలు, కన్యలు, జల బిందెలతో అమ్మవారికి అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. నున్న గ్రామంలో గంగానమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించిన రోజు భక్తులు పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం పంబళ్లచే శ్రీగంగానమ్మ అమ్మవారి జీవిత చరిత్ర ఆలపించారు. మహాకుంభ నివేదన, బోనాల సమర్పణ, మహా పూర్ణాహుతి, వేదస్వస్తి, హారతి మంత్ర పుష్పం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం మేళతాళాలతో అమ్మవారి గ్రామోత్సవం బోడపాడు, నున్న గ్రామాల్లో జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శించుకున్నారు.

కృష్ణయ్యపై దాడి చేసినవారిని అరెస్ట్ చేయాలి



పెనమలూరు: ఆర్.కృష్ణయ్యపై జరిగిన దాడి బీసీలపైన జరిగిన దాడేనని బీసీ సంఘ కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. ఆయన యనమలకుదురులో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్.కృష్ణయ్య ఎన్నికల ప్రచారంలో ఉండగా ఆయనపై రాయితో దాడి చేశాయటం దారుణమన్నారు. బీసీ నేతకు వస్తున్న ఆదరణ చూడలేకే కొందరు పథకం ప్రకారం దాడి చేయించి ఉంటారని ఆరోపించారు. రాళ్లతో దాడులు చేయటం పరిపాటిగా మారిందని, దమ్ము ధైర్యం ఉంటే ఎదురుగా వచ్చి పోరాటం చేయాలని సవాల్ చేశారు. కృష్ణయ్యపై దాడి పిరికి పంద చర్య అని ఖండించారు. కృష్ణయ్యపై దాడి చేసిన వారిని పోలీసులు గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నాగేంద్రబాబు, లంకా కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మున్నా, సలీం పలువురు పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



గన్నవరం: వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ మద్దతుగా గ్రామాల్లో ఆ పార్టీ నేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కేసరపల్లిలోని యాదవుల బజార్‌లో వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. పేదలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్న వంశీమోహన్‌తో పాటు సింహాద్రిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నేతలు కొలుసు వెంగళరావు, మేడూరి పుష్పానాథం, కాటూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. గన్నవరంలో సచివాలయ కన్వీనర్ పాగోలు సురేష్ నేతృత్వంలో ఇంటింటికి ప్రచారం చేశారు. నమూనా బ్యాలెట్‌ను చూపించి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. అల్లాపురం, దావాజిగూడెం, బుద్దవరం, వీఎన్.పురం కాలనీల్లో పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు.

కాలువ కట్ట వాసులకు మహర్దశ

- రూ.8 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం
- డ్రైయిన్లు, వీధి దీపాల ఏర్పాటు
- పైప్‌లైన్‌తో గ్యాస్ సరఫరా
- సమృద్ధిగా తాగునీరు
- టీడీపీ పాలనలో తీరని సమస్యలు



తాడిగడపలో కాలువ కట్టపై నిర్మించిన సిమెంట్ రోడ్డు

పెనమలూరు: మండల పరిధిలో బందరు కాలువ కట్టలపై నివశిస్తున్న పేద ప్రజలకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచింది. కాలువ కట్టలపై లక్షన్నర జనాభా నివశిస్తున్నారు. చాలా సంవత్సరాలుగా వారు కాలువ కట్టలపై నివశిస్తున్నా పాలకులు ఎవరూ వారిని పట్టించుకోలేదు. పైగా టీడీపీ పాలనలో కాలువ కట్టలపై ఇళ్లు తొలగించటానికి రంగం సిద్ధం చేశారు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కాలువ కట్ట వాసుల జీవితాల్లో వెలుగు నిండింది. వారికి జగనన్న పూర్తి భరోసా కల్పించారు. వివరాల్లోకి వెళితే..బందరు కాలువ కట్ట యనమలకుదురు నుంచి మొదలై తాడిగడప, పోరంకి, పెనమలూరు, గంగూరు, గోసాల, వైకుంఠపురం వరకు దాదాపు 17 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. విజయవాడ నగరానికి పెనమలూరు మండలం పక్కనే ఉండటంతో ఆటోనగర్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర రంగాల్లో పని చేసే కార్మికులు, రైతు కూలీలు, నిరుపేదలు బందరు కాలువ కట్టలపై చాలా సంవత్సరాలుగా ఉంటున్నారు. ఇళ్ల అద్దెలు భారంగా ఉండటంతో కాలువ కట్టలపై నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. పెనమలూరు మండలంలో స్థలం కొనాలంటే చుక్కలు కనబడే పరిస్థితి ఉండటంతో కాలువ కట్టలే పేదలకు అనువుగా మారాయి.

జగనన్న పాలనలో అభివృద్ధి..

బందరు కాలువ కట్టలు జగనన్న అధికారం చేపట్టిన తరువాత మహర్దశ పట్టాయి. గతంలో కాలువ కట్టలపై రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు, డ్రైయినేజీ వసతి లేక పోవటంతో కాలువ కట్టల వాసులు చాలా దారుణమైన స్థితిలో ఉండే వారు. అయితే జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు రూ.8 కోట్లతో కాలువ కట్టలపై సిమెంట్ రోడ్లు నిర్మించారు. యనమలకుదురులో ఇందిరానగర్ 1, 2, అంబేడ్కర్ నగర్, తాడిగడప కార్మికనగర్, రామానగర్, శ్రీనివాసానగర్ కట్టలపై సీసీ రోడ్లు వేశారు. పెనమలూరు పల్లిపేట, గంగూరు కాలువ కట్టలు, గోసాల, వైకుంఠపురం కాలువ కట్టలు నేడు సిమెంట్ రోడ్లతో కళకళలాడుతున్నాయి. వైకుంఠపురంలో గత 30 సంవత్సరాలుగా పరిష్కారం కాని రహదారి సమస్యలు ఈ ప్రభుత్వం లోనే పరిష్కారమయ్యాయి. కాలువ కట్టలు బారున ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. డ్రైయినేజీలు, తాగునీటి కుళాయి కనెక్షన్లు కూడా ఇచ్చారు. అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌తో వంట గ్యాస్ వసతి కూడా పేదలకు అందుబాటులోకి వచ్చింది.

చంద్రబాబు పాలనలో దినదిన గండమే..

చంద్రబాబు పాలనలో కాలువ కట్ట వాసుల జీవితం దినదినగండంగానే ఉండేది. కాలువ కట్టలు సుందరీకరణ పేరుతో నివాసాలు తొలగించాలని సీఆర్డీఏతో ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధానంగా యనమలకుదురు, తాడిగడప, గంగూరు ప్రాంత వాసుల ఇళ్ల తొలగింపునకు సన్నాహాలు చేశారు. దీంతో పేదల కంటిపై కునుకు కరువైంది. అయితే ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోవటంతో కాలువ కట్ట వాసుల జీవితాల్లో వెలుగు నిండింది. నేడు కాలువ కట్ట వాసులు ఎంతో ఆనందంతో జీవిస్తున్నారు.

న్యాయం చేసిన జగనన్న



జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత కాలువ కట్టలపై సీసీ రోడ్లు వేశారు. తమ జీవితాలకు భరోసా కల్పించారు. చంద్రబాబు పాలనలో చాలా ఇబ్బంది పడ్డాము. ఇప్పుడు ఆ భయం లేదు. జగనన్న ఉంటేనే మాకు న్యాయం జరుగుతుంది.

-ఎం.పేతురు, యనమలకుదురు

ఇప్పుడు ఆనందంగా ఉన్నాం



జగనన్న పాలనలో తాము కాలువ కట్టలపై ఆనందంగా జీవిస్తున్నాం. ఇప్పుడు ఇళ్లు తొలగిస్తారన్న భయం లేదు. జగనన్నపాలనలో కాలువ కట్టలపై మౌలిక వసతులు పూర్తిగా కల్పించారు. తాము జగనన్నకు రుణపడి ఉంటాం.

-జి.శ్రీరామ్‌మూర్తి, యనమలకుదురు

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు సంక్షేమం



గొడవర్రు ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు



కాసరనేనివారిపాలెంలో..



ప్రొద్దుటూరులో ఇంటింటి ప్రచారం చేస్తూ..

కంకిపాడు: వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం ముడిపడి ఉందని వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ నేతలు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నేతలు కాగిత రాజా రమేష్, యలమంచిలి రామినీడు, సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, ఎంపీటీసీ చుండూరు నిర్మల జ్యోతి, కలపాల సురేష్, చుండూరు మోహన్‌రావు, జె.పకీర్ రాజు పాల్గొన్నారు. మండలంలోని మద్దూరు శివారు కాసరనేనివారిపాలెంలో పెనమలూరు అసెంబ్లీ అభ్యర్థి జోగి రమేష్, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం చేస్తూ నమూనా బ్యాలెట్‌లను అందించారు. ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు జడా రవి, మాజీ సర్పంచ్ అంబటిపూడి డేవిడ్, నాయకులు బోరుగడ్డ కుమార్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో ఎన్నికల ప్రచారం విస్తృతంగా సాగింది. ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బేతపూడి సురేష్, పార్టీ నేతలు బీహెచ్ నాగిరెడ్డి, బీహెచ్ గిరిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వల్లె రాజు, గాలంకి సుబ్బారావు, వినోద్, లక్ష్మణ్, ఈ.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు స్పందన కరువు

గన్నవరం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. భారీ జనసమీకరణకు టీడీపీ నేతలు సన్నాహాలు చేసినప్పటికీ ఆశించిన మేరకు జనం సభకు రాలేదు. దీనికితోడు సభ ప్రారంభానికి ముందు భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఉన్న జనంలో కూడా సగం మంది వెళ్లిపోయారు. అసలు సభ జరుగుతుందో, లేదో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. చంద్రబాబు ప్రసంగం ప్రారంభమయ్యే సమయానికి పట్టుమని 500 మంది కూడా జనం లేక పోవడంతో సభాప్రాంగణం వెలవెలబోయింది. అసలే ఇరుకుగా ఉండే స్థానిక కొత్తపేట వద్ద ఊరచెరువు రోడ్డును సభాస్థలంగా ఎంపిక చేసుకున్నారు. బహిరంగ సభ అనుకున్న మేరకు సక్సెస్ కాకపోవడంతో ఆ పార్టీ నేతలు నిరుత్సాహానికి గురయ్యారు. సభకు వచ్చిన జనం జోరు వర్షంలో అనేక ఇబ్బందులు పడ్డారు.

అక్రమ మద్యం నిల్వలు స్వాధీనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం తిప్పనగుంటలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఓ రైస్ మిల్లులో మద్యం నిల్వలు ఉన్నట్లుగా సమాచారం అందటంతో గురువారం రాత్రి ఎస్ఈబీ, వీరవల్లి పోలీసులు, ఎన్నికల స్క్వాడ్ అధికారులు సమష్టిగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 125 మద్యం బాక్సులను గుర్తించారు. దీనిపై రైస్‌మిల్లు యాజమానులపై ఎస్ఈబీ అధికారులు కేసు నమోదు చేశారు.

వైఎస్ జగన్ పాలనలోనే పేదలకు మేలు



బాపులపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గడిచిన ఐదేళ్లుగా పరిపాలన సాగించిన వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపేందుకు ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని పలువురు నాయకులు అభ్యర్థించారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రమైన బాపులపాడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు నేతృత్వంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్తపల్లిలో చెరుకూరి శ్రీనివాస్, సింగన్నగూడెంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తలారి ఈశ్వరరావు, చిన్నాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వీరవల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు గూడవల్లి రత్నసుధాకర్, కొడెబోయిన బాబి, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా నేతృత్వంలో పార్టీ శ్రేణులు ప్రచారం చేశారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు పట్టం కట్టాలని కోరారు. గన్నవరం ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీని, మచిలీపట్నం ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును అఖండ మెజార్టీతో గెలుపించుకునేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.

చికిత్స పొందుతూ తాపీ కార్మికుడు మృతి

కంకిపాడు: భవనంపై నుంచి పడి గాయపడ్డ తాపీ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు..ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడుకు చెందిన కిమిడి లక్ష్మణరావు తాపీ కార్మికుడు. మేస్త్రి ఎలుకల శ్రీనివాసరావు వద్ద పని చేస్తున్నాడు. ఈనెల 8న ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్ పరిధిలో హరివిల్లు వెంచర్‌లో చలసాని భార్గవ్ ఇంటి పనికి వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం లిఫ్ట్ దగ్గర పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ కింద పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. తోటి కార్మికులు ఈ విషయాన్ని లక్ష్మణరావు కుమారుడు వాసుకు ఫోన్ చేసి చెప్పారు. క్షతగాత్రుడిని తొలుత కంకిపాడు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 9వ తేదీ రాత్రి లక్ష్మణరావు మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.


టీడీపీ ప్యాకేజీకి అమ్ముడుపోయిన కృష్ణ మాదిగ

క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జయరాజు



గన్నవరం: టీడీపీ ప్యాకేజీలకు అమ్ముడుపోయిన మంద కృష్ణమాదిగ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన పేరుతో ఎమ్మార్పీఎస్‌ను స్థాపించిన కృష్ణమాదిగ తమ జాతికి చేసిందేమీ లేదన్నారు. రాజకీయ పార్టీలు ఇచ్చే ప్యాకేజీలకు కక్కుర్తిపడి ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని అమ్మివేశారని ధ్వజమెత్తారు. ఉద్యమం ప్రారంభంలో ఉన్న నాయకులు కూడా ప్రస్తుతం ఆయన వెంటలేరని చెప్పారు. చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారిన కృష్ణమాదిగ ఆయన చెప్పినట్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో కనీసం రాష్ట్రంలోకి అడుగుపెట్టనీయని చంద్రంబాబుతో ఇప్పుడు చేతులు కలపడం కృష్ణ మాదిగ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని కృష్ణమాదిగ కుటుంబం ఒక్కటే బాగుపడిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి తెలిపారు. అతని మాటలు నమ్మి ఉద్యమంలో పాల్గొన్న ఎంతో మంది జైలుపాలయ్యారని చెప్పారు. దళిత మత్స్య సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్, పార్టీ నాయకులు తిరివీధి రంగారావు, పలు సంఘాలకు చెందిన రాచేటి రూతమ్మ, కలపాల అబ్రహం, మన్నే సుధాకర్‌రావు, అంబేడ్కర్ పాల్గొన్నారు.

నమూనా ఈవీఎంలతో ప్రచారం



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లిలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ల విజయాన్ని ఆకాంక్షిస్తూ పార్టీ శ్రేణులు గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామ కన్వీనర్ కందిమళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు వార్డులలో ప్రచారం చేస్తూ, నమూనా బ్యాలెట్లను ఓటర్లకు చూపిస్తూ సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు గోశాల కోటేశ్వరరావు గడప గడపకు వెళ్లి నమూనా ఈవీఎంలను ఉపయోగించే విధానం, ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. రాయల మహేంద్ర ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగింది.

జగనన్న పాలనలో మహిళలకు పెద్ద పీట

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీ



వేంపాడు ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ మోహన్, యాంకర్ శ్యామల

ఉంగుటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళల అభ్యున్నతికి పెద్ద పీట వేశారని, ఎవరిపైనా ఆధారపడకుండా సొంతకాళ్లపై జీవించేస్థాయికి ఎదిగారని గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చాగంటిపాడు, వేంపాడు, మధిరపాడు, తరిగొప్పల, నందమూరు, మానికొండ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు ఆయనకు ఎదురేగి సాదర స్వాగతం పలికారు. మానికొండలో బేతాళ సెట్టింగ్‌తో ఉత్సాహంగా జై జగన్, జై వంశీ అంటూ నినాదాలు చేస్తూ అడుగడుగునా ఆయనకు బ్రహ్మరథం పట్టారు. యువత పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావులకు ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసీ గెలిపించాలని కోరారు. వేంపాడులో నటి శ్యామల ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, పార్టీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, ఎంపీటీసీ ప్రసాద్, నాయకులు గుడిసే బాలస్వామి, రామకృష్ణ (ఆర్‌కే), సుర్రెడ్డి శ్రీమణిమ్మ, గోగినేని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



నిడమానూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ శీలం రంగారావు

రామవరప్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ మండలాధ్యక్షుడు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు అపార్టుమెంట్ల ఏరియాలో శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ పర్యటించి సంక్షేమ పథకాలు వివరించారు. రంగారావు మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో సంక్షేమం చేసి చూపించి జగన్ మాటల నాయకుడు కాదని చేతల నాయకుడిగా నిరూపించారన్నారు. ప్రజా నాయకుడైన జగన్‌ను ఏమి చేయలేక చంద్రబాబు నాయుడు జనసేన, బీజేపీ పార్టీలను కలుపుకుని నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఈ కుట్రలను మనమంతా కలిసి తిప్పి కొట్టాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, తమ రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంకం రామకృష్ణ, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సంతోష్ మారుతీ షోరూమ్‌లో ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ ఆవిష్కరణ



ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ ఆవిష్కరిస్తున్న మనీష్‌కుమార్‌సింగ్

పెనమలూరు: కానూరు సంతోష్ మారుతీ సుజుకి లో ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారును శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ మారుతీ సుజుకి ప్రజల అవసరాలకు తగ్గట్లుగా వాహనాలు తయారు చేస్తుందన్నారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించటమే కాకుండా వారి అవసరాలు తీర్చుతుందని తెలిపారు. ది ఎపిక్ న్యూస్విఫ్ట్ కారు భారతదేశంలోనే అత్యధిక మైలేజ్ లీటరు పెట్రోల్‌కు 25.75 కిలో మీటర్లు ఇస్తుందన్నారు. సంతోష్ మారుతీ చైర్మన్ చుక్కపల్లి జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తమ షోరూమ్ రీజినల్‌లోనే ఉత్తమ సేవలు అందించటంతో రాయల్ ప్లాటినమ్ బహుమతి లభించిందన్నారు.

ఎపిక్ న్యూస్విఫ్ట్‌లో 6 ఎయిర్ బ్యాగులు, ఇంజిన్ హిల్ హోల్డ్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జింగ్, ఎల్‌ఈడీ ల్యాంప్స్, బూట్‌స్పేస్ ఇలా అనేక సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఎండీ చుక్కపల్లి శ్రీకాంత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామన్నారు. సీఈఓ శ్యామ్‌కుమార్‌కారు మాట్లాడుతూ ఆటోమేటిక్ కారు ప్రారంభ ధర రూ.7.79 లక్షలు ఉంటుందన్నారు. డీఎస్పీ కోటేశ్వరరావు, ఆర్ఎం.ఆర్. రాఘవరావు, ఏజీఎం.విజయ్‌కుమార్, నెక్కంటి మాధవి, కృష్ణశ్రీకాంత్, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల విస్తృత ప్రచారం



ఆత్కూరులో ప్రచారం నిర్వహిస్తున్న సింహాచలం

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్‌ఎంపీపీ సింహాచలం ఆత్కూరులో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గుర్తులు, క్రమ సంఖ్య ఉన్న పత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసీ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీమోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తేలప్రోలు, ఇందుపల్లి, ముక్కపాడు, వేమండ, ఉంగుటూరు గ్రామాల్లో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.